క్లుప్తంగా

రేపు వాలీబాల్ టోర్నమెంట్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 13న మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ రెవెల్లి మమతనాగరాజుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇమ్రాన్, బన్నీ, శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు అని తెలిపారు. మండలస్థాయి టోర్నమెంట్‌కు ఆధార్‌కార్డు తప్పనిసరి తీసుకురావాలని సూచించారు. 80080 69576, 77805 93127 నంబర్లలో సంప్రదించి టీం పేర్లు ఎంట్రీ చేసుకోవాలని తెలిపారు.

జరిమానా

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం వరకు కొనసాగింది. 2023–2024 సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులల్లో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి. మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్, టీఏ, సీఓలు, ఈసీ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు అందరికి మొత్తంగా రూ.2,95,000 జరిమానా విధించినట్లు అదనపు డీఆర్‌డీఓ మంజులాదేవి తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చక్రవర్తి

ఏటూరునాగారం : మండల కేంద్రానికి చెందిన వినుకోలు చక్రవర్తిని బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ పి. విజయ చందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని తెలిపారు. అలాగే తన ఎంపికకు సహకరించిన విజయచందర్‌రెడ్డి, బలరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు నీరు అందించాలి

చిట్యాల: రైతులు పండించే యాసంగి పంటలకు డీబీఎం 38 ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగు నీరు అందించాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు యాసంగిలో వేసిన వరి, మొక్కజొన్న పంటలకు సాగు నీరు లేక పోవడంతో ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మండలంలో వాగులు, చెరువులు కుంటలు, బోరు బావులు అడుగంటి పోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

గుండెపోటుతో రైతు మృతి

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెంలో ముదురుకోల్ల లక్ష్మీనర్సు (59) రైతు గుండెపోటుతో మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన లక్ష్మీనర్సు శుక్రవారం తనకున్న వ్యవసాయ పంటపొలంలో పనిచేసి రాత్రి పడుకున్న క్రమంలో చాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న కొడుకులకు చెప్పగా 108 వాహనంలో ఏటూరునాగారం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

అనారోగ్యంతో యువకుడు..

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని పంబపూర్‌కు చెందిన ఎల్లబోయిన పవన్ కల్యాణ్ (25) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భిక్షపతి కుమారుడు పవన్ కల్యాణ్ ఈనెల 9న మేడారం అమ్మవార్లను దర్శించుకునేందుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 11 గంటలకు పంబపూర్‌కు వెళ్లి అనంతరం 12 గంటలకు మొక్కజొన్న చేనుకు కాపాలా కోసం వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు మొక్కజొన్న చేను వద్దకు వెళ్లి చూడగా పవన్ కల్యాణ్ చేతులు కాళ్లు బిగుసుకుపోయి కనిపించాడు. వైద్య పరీక్షల కోసం కాటాపూర్‌లోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో ములుగు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తండ్రి భిక్షపతి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దులు..

వెంకటాపురం(ఎం) : వన్యప్రాణుల నుంచి పంటను రక్షించుకునేందుకు పంట చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రెండు దుక్కిటెద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని కేశవాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్లవేని రవి వరిగడ్డి తెచ్చేందుకు ఎడ్లబండి కట్టుకొని తనపొలం వైపు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఒక రైతు గ్రామసమీపంలోని బుచ్చికుంట శివారులో తన పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగలి దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఎడ్లబండిలో ఉన్న రవితో పాటు మరో రైతు తిరుపతి ఎడ్లబండి నుంచి దూకి దూరంగా పారిపోయారు. సదరు రైతు నుంచి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు రవి ఫిర్యాదు చేశాడు.

చెరువులను కమ్మేసిన గుర్రపుడెక్క


టేకుమట్ల చెరువులో విస్తరించిన గుర్రపు డెక్క


కుందనపల్లి చెరువులో తొలగిస్తున్న గుర్రపుడెక్క(ఫైల్)

- చేపల ఎదుగుదలకు ఆటంకం
- తొలగించేందుకు నిధులు కరువు

టేకుమట్ల: మండలంలోని చెరువులు, కుంటలు గుర్రపు డెక్కతో నిండిపోయింది. ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేపలను అందిస్తుంటుంది. కానీ చెరువుల్లో చేపల ఎదుగుదలకు గుర్రపు డెక్క తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి గుర్రపుడెక్క చెరువుల్లో పెరగడం ప్రారంభమైతే ప్రతీ సంవత్సరం పెరుగతూ చెరువు మొత్తం విస్తరిస్తుంది. దీంతో చేపలకు సరిపడా ఆక్సిజన్ అందక ఎదుగుదల పూర్తిగా లోపించడమే కాకుండా చేప పిల్లలు మృత్యువాత పడడంతో మత్స్యకారులు ఆర్థికంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. అంతే కాకుండా చేపలు పట్టే సమయంలో గుర్రపు డెక్క వల్ల తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మత్స్యకారులు మృత్యువాత పడ్డ సంఘటనలు సైతం ఉన్నాయి. చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడంతో మత్స్యకారులు గుర్రపు డెక్కను తొలగించలేక చేపలు ఎదగక పోవడంతో నష్టాలనే చవి చూస్తున్నారు. మండలంలోని 80 చెరువుల్లో ప్రభుత్వం చేపలను పంపిణీ చేయగా గుర్రపు డెక్క తక్కువగా ఉన్న కొన్ని చెరువుల్లో మాత్రమే చేపల పెంపకం ఆశాజనకంగా ఉందని మత్స్యకారులు తెలిపారు.

గుర్రపు డెక్క నివారణ చర్యలు..

చెరువుల్లో పెరిగే గుర్రపు డెక్క నివారణకు వేసవి కాలంలో గుర్రపు డెక్క మొక్కలను పూర్తిగా తొలగించి సున్నం పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే కొన్ని ప్రత్యేక రసాయనాలను పిచికారీ చేయడం వల్ల క్రమంగా గుర్రపు డెక్కను నివారించవచ్చని తెలుపుతున్నారు. చెరువుల్లో పెరిగే గుర్రపు డెక్క నివారణకు ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటిస్తే కొంతమేర తమకు ఆసరాగా ఉటుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

రూ.3లక్షలు ఖర్చు చేశా..



మా గ్రామంలోని చెరువును సొసైటీ నుంచి తీసుకుని చెరువులో గుర్రపు డెక్కను తొలగించేందుకు రూ.3లక్షలు ఖర్చు చేశా. అలాగే మళ్లీ గుర్రపు డెక్క రాకుండా ఉండేందుకు కొన్నిరసాయనాలను సైతం పిచికారీ చేశా. ప్రస్తుతం చెరువులో గుర్రపు డెక్క ప్రభావం తక్కువగానే ఉంది. నిధులు లేకపోవడంతో మేమే ఖర్చు భరించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపుకు ప్రభుత్వం సహకరించాలి.

– ఇట్ల సురేశ్, మత్స్యకారుడు, కుందనపల్లి

చేపలు చనిపోతున్నాయి..



చెరువుల్లో పెరిగే గుర్రపు డెక్కతో చేపల వేట సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నాం. ప్రతీ సంవత్సరం చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించినా మళ్లీ వస్తుంది. చెరువులల్లో గుర్రపు డెక్క శాశ్వత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చెరువుల్లో గుర్రపు డెక్క వల్ల చేపలు చనిపోతున్నాయి.

– దాసరి రాజయ్య మత్స్యకారుడు, టేకుమట్ల

నిధులు కేటాయించాలి



చెరువుల్లో చెత్తా చెదారం, గుర్రపు డెక్కను తొలగించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ప్రతీ సంవత్సరం చెరువులను శుభ్రం చేస్తే చేపలు ఎదుగుతాయి. అంతే కాకుండా చెరువుల్లో నీళ్లు సైతం శుభ్రంగా ఉంటాయి. గుర్రపు డెక్క చేపల ఎదగకపోడం, చనిపోవడం జరుగుతుంది. దాని వల్ల మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుంది.

– జక్కుల కుమార్, మత్స్యసహకార సంఘం మండల అధ్యక్షుడు

వడ్డెర కులస్తుల అభివృద్ధికి కృషి


నినాదాలు చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

- వడ్డెర కులస్తుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజేందర్

భూపాలపల్లి రూరల్: వడ్డెర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని వడ్డెర కులస్తుల సంఘం ఉపాధ్యక్షుడు విజేందర్, కన్వీనర్ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఓబన్న జయంతి సందర్భంగా శనివారం పట్టణ అధ్యక్షుడు మిర్యాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి అల్లేపు రవి ఆధ్వర్యంలో సంఘం నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న వడ్డెర కులస్తుల బతుకులు మారడం లేదన్నారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గణపురం మండల అధ్యక్షుడు శివరాత్రి సారయ్య, జిల్లా వడ్డెర సంఘం నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో వెలసిన నాపాక శ్రీసర్వతోభద్రలక్ష్మి నరసింహాస్వామి దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం నాపాక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యం, జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు యాదండ్ల రాజయ్య, నాయకులు చిలుకల రాయకోంరు, నక్క భాస్కర్, శంకర్, రమణాచారి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు సరికాదు

- ప్రజాసంఘాల నాయకులు

కాటారం: జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని ప్రజా సంఘాల నాయకులు దేవేందర్, కామర గట్టయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో నానాటికి పత్రిక స్వేచ్ఛ దిగజారుతున్నందన్నారు. నిజాన్ని నిర్భయంగా వెల్లడించే జర్నలిస్టులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని దీంట్లో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చంద్రకర్ హత్య జరిగిందన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నాయకులు రాజయ్య, ముంజల భిక్షపతి, లక్ష్మీనారాయణ, యుగందర్, శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

గోవిందనామస్మరణతో నగర సంకీర్తన

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం సీతా రామచంద్రస్వామి ఆలయంలో కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భక్తులు గ్రామంలో గోవింద నామస్మరణతో నగర సంకీర్తన కార్యక్రమాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో చివరి శనివారం కావడంతో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామంలోని వీధుల్లో గోదాదేవి అమ్మవారి చిత్రపటం, కలశంతో గోవిందనామాన్ని స్మరిస్తూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని సీతారామచంద్రస్వామి, లక్ష్మ ణ, ఆంజనేయ స్వామికి అర్చకులు జీడికంటి మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అ నంతరం నిర్వహించిన కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు శఠారితో ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదా లను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు నర్రా శ్రీధర్, కడియాల సుదర్శన్‌నా యుడు(పటేల్), సారయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

టేకుమట్ల: తెలంగాణ నేతన్నలకు పొదుపు, భరోసా, భద్రతా పథకంలో రూ.163 కోట్ల నిధులను విడుదల చేసినందుకు శనివారం మండల కేంద్రంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మాచర్ల మహేందర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కుటుంబాలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు మాచర్ల రాజేష్, దూడం రాములు, మాచర్ల మొగిళి, రవి, పోసాలు, శంకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కుమార్

వెంకటాపురం(కె): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి డప్పులు, లక్ష గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మడిపల్లి శ్యామ్‌కుమార్, వావిలాల సాంబశివరావు, తోకల శివ, వేల్పుల మల్లేష్, గుగ్గిల్ల నరేంద్ర, యాసం మహేష్, మల్లికార్జున్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సెంటర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



మల్హర్: మండలంలోని తాడిచర్ల ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శనివారం తాడిచర్ల గ్రామానికి చెందిన 32 మంది అయ్యప్ప మాలధారులు శబరిమలకు బయలుదేరారు. 41రోజుల పాటు అయ్యప్ప దీక్షను పూర్తి చేసుకున్న స్వాములు మణికంఠుని దర్శనం కోసం శబరియాత్రకు వెళ్లారు. అంజనేయ స్వామి ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడిని తలపై ఉంచి యాత్రను ప్రారంభించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- దుగ్యాల రాంచందర్‌రావు


క్రికెట్ కిట్ అందజేస్తున్న రాంచందర్‌రావు

టేకుమట్ల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దుగ్యాల రాంచందర్‌రావు అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌లో యువజన నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడలకు శనివారం రాంచందర్‌రావు హాజరై క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు కొనసాగించాలన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, క్రీడాకారులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్సై అశోక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో ప్రజలకు, వాహనదారులకు రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఫోర్ వీలర్స్ వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సుందర్ నాయక్, శ్రీనివాస్ ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ సారంగపాణి, కృష్ణ, వాహనదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన

- ప్రిన్సిపాల్ లాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లాలు

కాటారం: కాటారం గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించడం జరగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ లాలు అన్నారు. శనివారం గిరిజన గురుకుల బాలుర కళాశాలలో జరిగిన ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పాల్గొని పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యా బోధనతో పాటు మంచి వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇలానే కొనసాగించాలని సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ లాలు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని విధాల ముందుకు వెళ్లడానికి ఉపాధ్యాయుల సహకారంతో పాటు తలిదండ్రుల సహకారం ఉండాలని కోరారు. సంక్రాంతి సెలవుల్లో గాలిపటాలు మంజా దారంతో ఎగరవేయకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, డిప్యూటీ వార్డెన్ వెంకట్రామిరెడ్డి, నాగమణి, వెంకటయ్య, బలరాం, సంపత్, కష్ణమాచారి, రాజయ్య, రామకష్ణ, మహేందర్, శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తలిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై కన్ను

- అమ్మకానికి కబ్జా భూములు
- కోట్ల రూపాయల భూములు హాంఫట్
- చెరువులు, శిఖం భూములను వదలని భూబకాసురులు


మంగపేటలో కబ్జాకు గురైన మామిడికుంట చెరువు

మంగపేట: మండలంలో భూబకాసురులు ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం భూములను కబ్జా చేస్తూ భూమాతను చెరబడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను పలువురు అక్రమంగా కబ్జా చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. కొందరు తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేశారు. మరికొందరు ప్లాట్లుగా చేసి ఒక్కో గుంటకు రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కబ్జాదారులపై చర్యలు ప్రభుత్వ అధి కారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. మండలంలో 130 చెరువులు, కుంటలకు చెందిన సుమారు 600 ఎకరాలకు పైగా శిఖంభూమి కబ్జాకు గురైనట్లు అంచనా వేశామని ఇరిగేషన్ అధికారులు చెప్పడం గమనార్హం. మండల కేంద్రం పరిధిలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 107, 125తో పాటు మరో 44 సర్వే నంబర్లపై 2010 ఎరాల ప్రభుత్వ భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం పట్టుమని 10 ఎకరాలు కూడా లేదు.


ఇళ్ల స్థలాలకు పెరిగిన డిమాండ్

మండలకేంద్రం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుండటంతో ఇళ్ల స్థలాలకు రెక్కలొచ్చాయి. దీంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడుతుంది. ఎక్కడ ఖాళీ జాగ కనిపించినా కబ్జా రాయుళ్లు పాగా వేస్తున్నారు. గంపోనిగూడెంలోని మామిడికుంట చె రువు పూర్తిగా కబ్జాకు గురి కాగా ఇక్కడ భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ ఇటు రెవెన్యూ అధికారుల చూసీ చూడనట్లుగా వ్యవహరి స్తున్న తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్ర

ఏజెన్సీ ప్రాంతమైన మంగపేటలో 1/70, ఎల్టీఆర్, పీసా చట్టాలు అమలులో ఉన్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని భూబకాసురులు కబ్జాలకు చేసి దర్జాగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఆయా నిర్మాణాలకు పంచాయతీ అధికారులు ఇంటి నంబర్లు ఇస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంతో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై స్థానికులు. ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాలు అధికారులకు పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని వారి కనుసన్నల్లోనే ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా సెలవు రోజుల్లోనే కబ్జా స్థలాల్లో రాత్రికి రాత్రి వెలుస్తున్న తాత్కాలిక గుడిసెలను అధికారులు తొలిగించకపోవడంతో రెవెన్యూ అధికారులపై వస్తున్న ఆరోపణలు నిజమనే బలాన్ని చేకూరుస్తున్నాయి.

హైడ్రా తరహాలో చర్యలు తీసుకోవాలి



తహసీల్ ఎదుట, కార్యాలయ పరిసరాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములతో ఇప్పటికే కబ్జాకు గురయ్యాయి. ఈ విషయంపై ఐదేళ్లుగా తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా. నేటికి ఫలితం లేకుండా పోయింది. ఏజెన్సీ చట్టాల నిబంధనలను అధికారులు అమలు చేయకపోవడం కబ్జాకు ప్రధాన కారణం.

తాటి నాగరాజు,
ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి